# కథా కేళి

మల్లాది వెంకట కృష్ణమూర్తి

## టి.వి. కి కహానీ

చాలా రోజులుగా పిల్లలు, భార్య పోరు పెడుతున్నారు హైదరాబాద్ వెళ్ళి మంచి టి.వి.ని కొనుక్కురమ్మని. వాళ్ళ గొడవ ఎక్కువవడంతో ఇక తప్పదని హనుమకొండ నుంచి బస్‌లో హైదరాబాద్ చేరుకున్నాడు ప్రసన్నమూర్తి.

సరాసరి నల్లకుంటలోని తన బావమరిది రాఘవరావ్ ఇంటికి చేరుకున్నాడు. రాఘవరావ్ కొడుకు ఎలక్ట్రికల్ ఇంజనీర్ కాబట్టి టి.వి. మంచిది అవునో కాదో చూసి చెప్పగలడనే ఆశ వుంది ఆయనకు.

ప్రసన్నమూర్తి రాఘవరావ్ ఇంటికి చేరుకునే సరికి చీకటి పడుతోంది. వాళ్ళింట్లో హాల్లో కూర్చునివున్నారు అంతా. టి.వి. చూస్తున్నారు.

"ఎప్పుడొచ్చావ్ బావా?" అడిగాడు రాఘవరావ్.

"ఇప్పుడే బస్సుకి వస్తున్నాను."

"అంతా కులాసేనా?"

"ఆహా."

"ఆఫీసు పనా?"

"కాదు. టి.వి. కొనమని మీ అక్కయ్య ఒకటే గొడవ చేస్తుంటేను...మీది ఎలా పనిచేస్తోంది" అడిగాడు రాఘవరావ్‌ని.

"దానికేం బ్రహ్మాండంగా వుంది. నీవే చూడు."

ప్రసన్నమూర్తి టి.వి.ని చూడసాగాడు. ఏదో నాటకం వస్తోంది.

"ఇలాంటి ప్రోగ్రాంలే వస్తుంటాయా ఎప్పుడూ?" అడిగాడు ప్రసన్నమూర్తి.

"ఢిల్లీ ప్రోగ్రాంలు బావుంటాయి"చెప్పాడు రాఘవరావ్ పెద్దకొడుకు.

"కాస్తంత మంచినీళ్ళు కావాలి" చెప్పాడు ప్రసన్నమూర్తి.

ఆయనకి వెంటనే మంచినీళ్ళు అందలేదు.

'నువ్వెళ్ళి ఇవ్వు అంటే నువ్వెళ్ళి ఇవ్వు' అని టి.వి.లో లీనమయిన ఆయన పిల్లలు టి.వి. నుంచి దృష్టి మరల్చలేదు.

చివరికి రాఘవరావ్ కూడా లేవకపోవడంతో ప్రసన్నమూర్తే లేచెళ్ళి బాత్‌రూంలో మొహం కడుక్కొని, వంటగదిలోకి వెళ్ళి మంచినీళ్ళ బిందె లోంచి వంచుకుని తాగాడు.

టి.వి.లో వార్తలయ్యాక ఏదో బుర్రకథ రాసాగింది. అది అట్టే ఆసక్తిగా లేకపోవడంతో ఓ పావుగంట టి.వి.ని ఆపేసారు. రాఘవరావ్ భార్య కుశలప్రశ్నలు అడిగి కాఫీ తెచ్చిచ్చింది.

ఆయన వచ్చిన పని తెలిసి అంతా టి.వి. కొనమని సజెస్ట్ చేసారు.

మళ్ళీ టి.వి.ని ఆన్ చేసేలోగా భోజనాలు వడ్డించింది ఆవిడ. ప్రోగ్రాం ఎక్కడ మొదలవుతుందో అని ఆదరాబాదరాగా తినీ తినక పరిగెత్తారు పిల్లలు.



రాత్రి టి.వి. స్టేషన్‌లో ప్రసారాలు అయిపోయేదాకా ఆ ఇంట్లో టి.వి. చూస్తూనేవున్నారు.

మర్నాడు ఆదివారం.

ఆదివారం మధ్యాహ్నం ప్రసన్నమూర్తికి టి.వి. చూసి చూసి విసుగేసింది. అలా బయటకి వెళ్ళొస్తానని బయలుదేరాడు.

సాయంత్రం తిరిగి ఇంటికొచ్చాడు.

"చక్కటి తోట ఇలా అయిపోయిందేమిట్రా?" అడిగాడు రాఘవరావ్ పెద్ద కొడుకుని.

"ఈమధ్య టైం వుండడం లేదు. బిజీ లైఫ్ అయిపోయింది" చెప్పాడు అతను.

ఆ రాత్రి హనుమకొండకి ప్రయాణమయ్యాడు ప్రసన్నమూర్తి.

"ఈ పూట వుంటే తెల్లారి టి.వి. కొనుక్కుని ఏ గోల్కొండకో వెళ్ళొచ్చుగా" చెప్పింది రాఘవరావ్ భార్య.

"మధ్యాహ్నం బయటకి వెళ్ళినప్పుడు నా కొలీగ్ ఇస్తానన్న అయిదువేలు ఇవ్వలేదు. పై వారానికి గడువు పెట్టాడు. మళ్ళీ వారం కొనచ్చు. వెళ్ళొస్తాను"చెప్పాడు ప్రసన్నమూర్తి.

రాత్రి పదకొండింటికి హనుమకొండలోని తనింటికి చేరుకున్నాడాయన.

"టి.వి. ఏదీ?" అడిగింది ఆయన భార్య.

"తేలేదు" చెప్పాడు.

"అదేం?' దొరకలేదా?" అడిగాడాయన రెండో కొడుకు అసంతృప్తిగా.

"మనకి టి.వి. ఎందుకు నాన్నా. వద్దు" చెప్పాడాయన బుజ్జగిస్తున్నట్టుగా.

"మళ్ళీ మొదటికొచ్చారా నాన్నగారు?" అడిగింది కూతురు కొద్దిగా విచారంగా.

"పిల్లలు ముచ్చట పడుతున్నారు. ఓ టి.వి. కొనే స్థోమత గలవాళ్ళం, కొనచ్చుగా. ఎందుకు వట్టిచేతులతో వచ్చారు? హైదరాబాద్ చూడడానికి కాదుగా మీరు వెళ్ళింది" కోపంగా చెప్పింది ఆయన భార్య.

"కొందామనే వెళ్ళానే. కాని అక్కడికి వెళ్ళాక నా మనస్సు మార్చుకున్నాను."

"ఎందుకు?" అడిగిందావిడ కోపంగా.

"మీ తమ్ముడి ఇంటికి వెళ్ళాక తెలిసింది ఏ ఇంటికైనా టి.వి. ఎంత ప్రమాదమో. అంతా టి.వి. చుట్టూ చేరి చూస్తారు. ఇంటికెవరయినా వస్తే మంచినీళ్ళు ఇచ్చేందుకు కూడా లేవడానికి ఇష్టపడరు పెద్దలు, చిన్నలు. ఒకళ్ళతో మరొకళ్ళు ఆదివారాలు ఇదివరకటిలా కలసి భోజనం చేస్తూ ఆప్యాయంగా మాట్లాడుకోవడంలేదు. నిద్ర లేచింది మొదలు ఆ టి.వి. చూస్తూ గడిపేస్తున్నారు. పెద్ద వెధవకి మొక్కలకి నీళ్ళు పోసే టైం లేదుట. తోటంతా ఎండిపోయి వుంది. టి.వి. చూస్తుండగా ఎవరయినా ఓ మాట మాట్లాడితే చాలు మిగతావాళ్ళు 'ష్ ష్ ష్' అంటారు మాట్లాడవద్దన్నట్టుగా. రాత్రి భోజనాలయ్యాక వెన్నెట్లో ఇప్పుడు ఇదివరకులాగా నడవడానికి రాఘవరావ్ తన పెళ్ళాం పిల్లలతో బయటకి వెళ్ళడం లేదు. పిల్లలకి చదువు మీద ధ్యాస తగ్గి టి.వి. మీద పెరిగింది. ఒకరితో మరొకరు మాట్లాడుకోవడం కొంతకాలం పోతే మర్చిపోతారేమో ననిపిస్తుంది వాళ్ళని చూస్తే. పక్కవాళ్ళతో మాట్లాడడం, ఒకరింట్లో చేసిన కూరలు మరొకరికి ఇచ్చుకోవడం లాంటి స్నేహ భావాలన్నీ తగ్గిపోయాయి పక్కవాళ్ళింట్లో కూడా టి.వి.వుండడంతో. ఆ చిన్న పెట్టె మనుష్యుల్ని విడదీసే దయ్యంలా అనిపించిందే. మనింట్లోనూ అలాగే అవుతుందని కొన బుద్ధికాలేదు" చెప్పాడు ప్రసన్నమూర్తి.